సాక్షి
నల్లగొండ
శనివారం ၊ 11 ၊ ఫిబ్రవరి ၊ 2023



పప్పులతో పోషకాహార భద్రత

పప్పు దినుసుల సాగుతో పోషకాహార భద్రత సాధించవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. - 8లో



పుష్కర ఘాట్.. డేంజర్ స్పాట్

నాగార్జున సాగర్‌లోని శివాలయం వద్ద గల పుష్కర ఘాట్ సందర్శకులకు ప్రాణసంకటంగా మారింది. - 8లో

గరిష్టం/కనిష్టం
34°/16°

వాతావరణం

ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

గూడు.. గోడు!



నల్లగొండలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో మొలిచిన చెట్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులే..

- మంజూరైన ఇళ్లలో పూర్తయినవి పావు వంతే
- వాటిల్లోనూ మౌలిక వసతుల కల్పనలో వీడని అలసత్వం
- మరికొన్ని చోట్ల ప్రారంభానికే నోచుకోని దుస్థితి
- పూర్తయినవి పంపిణీ చేయక.. శిథిల భవనాలుగా దర్శనం
- నెరవేరని పేదల సొంతింటి కల

జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు

మంజూరైనవి	పూర్తయినవి	పంపిణీ చేసినవి
7,829	2,089	32

కొనసాగుతున్నవి	పనులే ప్రారంభం కానివి
5,648	60



అడవిదేవులపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఏళ్లు గడుస్తున్నా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని చేపట్టినా.. పూర్తి చేయడంలో వెనుకబడి పోయింది. దీంతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రారంభమే కాకపోగా, మరికొన్ని ప్రాంతాల్లో ప్రారంభమైనా ఏళ్ల తరబడి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల పూర్తయి నెలలు గడిచినా మౌలిక వసతులు కల్పించ లేదు. దీంతో ప్రజలకు కేటాయించకముందే ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. కంప చెట్లు మొలిచి శిథిల భవనాలుగా మారిపోయాయి. నిర్మాణ పనులను పూర్తి చేయించాలన్న ధ్యాస అధికార యంత్రాంగానికి లేకుండాపోయింది. కనీసం పాలకులు కూడా పట్టించుకోకపోవడంతో సొంతింటి కోసం పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

డబ్బులు సరిపోవంటూ

జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం 2016లోనే ప్రారంభించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.4 లక్షలు ఇస్తుంది. అయితే, ఈ మొత్తం సరిపోడం లేదని కాంట్రాక్టర్ల నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేయడంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు.

జిల్లాలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితి ఇలా..

- చిట్యాల పట్టణంలో ప్రభుత్వం 2018లో 240 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. వాటి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. కేవలం స్లాబులు, గోడల నిర్మాణవ పూర్తయింది. మిగతా పనులేవీ చేయలేదు. తలుపులు, కిటికీ తలుపులు, తాగునీటి ఏర్పాటు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. వట్టిమర్తి గ్రామంలో వంద ఇళ్లు, గుండ్రాంపల్లి 56 ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే నిలిచిపోయాయి.
- కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల వద్ద జాతీయ రహదారి పక్కనే 2016లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మండలానికి 100 ఇళ్లు మంజూరు చేయగా.. ఆ స్థలం ముందు భాగంలో కాలువ ఉండడంతో ఇళ్ల చుట్టూ నీరు నిలుస్తోంది. దీంతో అధికారులు 80 ఇళ్లకు కుదించారు. అందులో 32 ఇళ్ల పనులను ప్రారంభించినా నిధుల్లేక మధ్యలోనే నిలిపివేశారు.
- సాగర్ నియోజకవర్గంలో 19 గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. మొదట అనుముల మండలంలో 40, పెద్ద పూరలో 20, గుర్రంపోడులో 40, తిరుమలగిరిలో 80, నిడమనూరులో 100, త్రిపురారం మండలంలో 100 ఇళ్లు మొత్తంగా 380 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు. కొన్ని గ్రామాల్లో స్థలాలను ఎంపిక చేసి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు.
- దేవరకొండ పట్టణ శివారులో 560 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 400 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మౌలిక వసతులు కల్పించ లేదు. మరో 160 ఇళ్ల పనులు కొనసాగుతూనే ఉన్నాయి.
- అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెంలో 2018లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల నుంచి 60 శాతం పనులే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న ఆ ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

సొంత ఇల్లు లేక ఇబ్బందులు



గుండ్రాంపల్లిలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా. సొంత ఇల్లు లేకపోవటంతో భార్య, ఇద్దరు పిల్లలు, మా అత్తమ్మతో కలిసి అద్దె ఇంట్లో అనేక ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి ఇల్లు ఇవ్వాలి.

– నర్సింహ, గుండ్రాంపల్లి, చిట్యాల మండలం

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి



మా గ్రామంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూంల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆగిపోయాయని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పంపిణీ చేయాలి.

– శ్రీను, అయిటిపాముల, కట్టంగూరు మండలం

త్వరగా పూర్తి చేయాలి



అర్హులు ఎక్కువగా ఉన్నా 20 ఇళ్లే నిర్మిస్తున్నారు. అవి కూడా పూర్తి చేయలేదు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. మరిన్ని ఇళ్లు కట్టించి అర్హులందరికీ ఇవ్వాలి.

– ఆర్.రవీందర్, అడవిదేవులపల్లి

న్యూస్‌రీల్

వైద్యాధికారి పోస్టులకు దరఖాస్తులు

నల్లగొండ టౌన్ : జిల్లాలోని ఆయుష్, డిస్పెన్సరీల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేదం, హోమియో, యునానీలో బీఏఎంఎస్, బీయూఎంఎస్ డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

108లో పోస్టులకు..

నల్లగొండ టూటౌన్ : ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అత్యవసర సేవల 108 వాహనాల్లో ఈఎంటీ, పైలట్ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ గ్రూప్‌లో డిగ్రీ (డిప్లోమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ, బీఎస్సీ నర్సింగ్, జీఎస్‌ఎం, బీఫార్మ, డీఫార్మా, ఇతర పారా మెడికల్) కోర్సు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వయసు 30 సంవత్సరాలలోపు ఉండాలని.. రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. పైలట్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 35 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 14న 108 జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి

రామగిరి(నల్లగొండ) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 11న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్ పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, మోటార్ వాహనాల ప్రమాదాలు, బ్యాంకు సేవలు, కుటుంబ వివాదాలు, ప్రీలిటిగేషన్ కేసులను కక్షిదారులు సమ్మతి మేరకు పరిష్కరించనున్నట్లు తెలిపారు. సివిల్ కేసుల్లో రాజీపడితే ఫిర్యాదుదారులు కోర్టుకు చెల్లించిన ఫీజును తిరిగి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు అప్పీలు ఉండదని చెప్పారు. కక్షిదారులు అదాలత్‌లో పాల్గొని తమ కేసులు పరిష్కరించుకుని సమయాన్ని ఆదా చేసుకోవాలని కోరారు.

నేడు జెడ్పీ సమావేశం

నల్లగొండ : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మాలలకు ప్రాధాన్యం కల్పించాలి



తాళ్లపల్లి రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళిత బంధు పథకంలో మాలలకు కూడా సముచిత ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని మాల మమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు అన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమం చేసేందుకు సిద్ధం కావాల పిలుపునిచ్చారు. అనంతరం మాలమహానాడు విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తాళ్లపల్లి రమేష్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షులు చింతపల్లి బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గాజుల పున్నమ్మ, బొప్పాని నగేష్, సురేష్, విజయ్, నాగటి జోసఫ్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులకు మందుల కిట్లు..

- షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేయనున్న వైద్య ఆరోగ్యశాఖ
- పీహెచ్‌సీలకు చేరిన ఎన్‌సీడీ కిట్లు
- నేడు జెడ్పీ సమావేశంలో ప్రారంభం



ఎన్‌సీడీ కిట్

నల్లగొండ టౌన్ : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందుల కిట్లు అందజేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ పూనుకుంది. ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) కిట్ల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. అసంక్రమిత వ్యాధులైన షుగర్, బీపీ, గుండె, క్యాన్సర్, చెవి, గొంతు సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాధితులందరికీ ఉచితంగా ఈ కిట్లు అందజేయనుంది. ఎన్‌సీడీ కిట్‌లు ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. వాటన్నింటిని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరవేశారు. శనివారం నిర్వహించే జెడ్పీ సమావేశంలో కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

కిట్‌లో మందులు ఉంచి అందజేత..

జిల్లా వ్యాప్తంగా 1,35,680 మంది బీపీతో, 69,834 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ గణాంకాలు చెపుతున్నాయి. ప్రస్తుతం అందజేయనున్న ఎన్‌సీడీ కిట్లలో బీపీ బాధితులకు మూడు రకాల మందులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు రెండు రకాల మందులను కిట్‌లో పెట్టి ఇవ్వనున్నారు. అయితే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతన్న వారికి స్థానికంగా ఉండే ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు నెలనెలా మందులు అందిస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఎన్‌సీడీ కిట్లలో ఆయా మందులను భద్రపర్చుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు క్యాన్సర్, గుండె సంబంధిత బాధితుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖ సేకరిస్తోంది. భవిష్యత్‌లో వారికి కూడా ప్రతి నెలా మందులు ఇవ్వడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అదే విధంగా ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో భాదపడుతున్న వారి వివరాలను కూడా క్షేత్రస్థాయిలో ముమ్మందు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనుంది.

నేడు లాంఛనంగా ప్రారంభం..

ఎన్‌సీడీ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రారంభించనున్నారు. సమావేశంలో పాల్గొనే జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర జిల్లా అధికారుల సమక్షంలో ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. సోమవారం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో గుర్తించిన బాధితులకు స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కిట్లను అందజేయనున్నారు.

ప్రతి నెలా మందులు ఇస్తాం



బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారిని గుర్తించి ఇప్పటికే ప్రతి నెలా ఉచితంగా మందులు ఇస్తున్నాం. ఎన్‌సీడీ కిట్‌లను కూడా స్థానికంగా ఉంటే ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు అందజేస్తారు. బాధితులు మందులను సక్రమంగా కిట్లలో భద్రపర్చుకునే అవకాశం కలుగుతుంది. మందులు తీసుకున్న వారు తప్పకుండా వాడాలి. క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కూడా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారికి కూడా ఉచితంగా మందులు అందజేస్తాం.

– డాక్టర్ అనిమల్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి



కళ్లద్దాలను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : కంటి వైద్య శిబిరాన్ని పోలీసులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో సిబ్బంది అంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, డీఎస్పీలు నర్సింహారెడ్డి, రమేష్, ఏఓ మంజుభార్గవి, సీఐలు ఆదిరెడ్డి, వీరరాఘవులు, మహేశ్వర్, సత్యం, స్వర్ణన్‌రాజు, హరిబాబు, డాక్టర్ ప్రదీప్త కుమార్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : మార్చి 1, 2, 3 తేదీల్లో మిర్యాలగూడలో జరిగే గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్‌ఎస్పీ అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు మాజీ ఎంపీ, ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు బృందా కరత్, మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడావత్ రవినాయక్, కొర్ర శంకర్ నాయక్, జిల్లా నాయకులు వినోద్‌నాయక్, దేశీరాం నాయక్, పాపానాయక్, నరేష్‌నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పార్కును సందర్శించిన మానవ హక్కుల చైర్మన్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని విద్యానగర్‌లో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును శుక్రవారం మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య సందర్శించారు. పార్కును ఎప్పుడు పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు చంద్రయ్యను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి కాసేపు షటిల్ ఆట ఆడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, రామ్మోహన్, వీరారెడ్డి, పంతులు శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, రాములు, భూపాల్ రెడ్డి, చకిలం వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న జస్టిస్ చంద్రయ్య తదితరులు

బహుజనులకు రాజ్యాధికారం సాధిస్తాం

- డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్



మిర్యాలగూడ పట్టణంలో పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహారాజ్

మిర్యాలగూడ టౌన్ : వందలో పది శాతం కూడా లేని అగ్రవర్ణాలను అధికారం నుంచి దించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారాన్ని సాధించి తీరుతామని దళిత్ శక్తి ప్రోగ్రాం(డీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్రవారం వేములపల్లి మండలం శెట్టిపాలెం నుంచి రాజీవ్‌నగర్ మీదుగా నందిపాడు నుంచి సాగర్ రోడ్డులోని ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం కోసం తాను పది వేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేపట్టానని చెప్పారు. ఆనాటి నుంచి అగ్రవర్ణాల పాలకుల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడిపోయారని అన్నారు. అగ్రవర్ణాల నుంచి విముక్తిని చేయడానికి ఈ మహా పాదయాత్ర అన్నారు. అణగారిన వర్గాలు రాజ్యాన్ని పాలించడానికి అంబేద్కర్ ఓటు హక్కు ఇస్తే.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అగ్రకులాలతో రాజకీయ పోరాటం చేయకుండా రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం తిరుగుతునే ఉన్నారని పేర్కొన్నారు. రాజ్యాధికార సాధనకు బడుగు, బలహీన వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్‌పీ నాయకులు గిరి, ఎల్లయ్య, రఘురాం, నాగయ్యగౌడ్, అరవింద్ ముదిరాజ్, రాజశేఖర్, కళ్యాణ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా..

- నిరంతరం వాహనాల తనిఖీ చేపడుతున్న పోలీస్ శాఖ
- మూడు రోజుల నుంచి ప్రత్యేక కార్యాచరణ
- నిబంధనలు పాటించకుంటే వాహనం సీజ్, జరిమానా
- అన్ని పత్రాలు కలిగి ఉండేలా అవగాహన కల్పిస్తున్న పోలీసులు



పోలీసుల తనిఖీలో పట్టుబడిన వాహనాలు

నల్లగొండ క్రైం: నల్లగొండను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నిరంతరం వాహనాలను తనిఖీలు చేయాలని కార్యాచరణ సిద్ధం చేసి మూడు రోజులుగా జిల్లాలో అమలు చేస్తోంది. ఎస్పీ అపూర్వరావు ఆదేశాలతో బుధవారం నుంచి ప్రతిరోజూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని రకాల వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పోలీసులు వాహన తనిఖీల్లో భాగస్వాములవుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా..

జిల్లాలోని ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలనే పోలీస్ శాఖ లక్ష్యం. ఈ మేరకు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వాహనదారులపై నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై కొరడా ఝులిపిస్తున్నారు. ఈ క్రమంలోనే మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, ఎలాంటి ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా, నంబర్ ప్లేట్ సగం కనిపించే, నంబర్ కనిపించకుండా స్టిక్కర్ వేసే, పరిమితికి మించి ఎక్కువ మందిని తరలించే వాహనాలతోపాటు సీటు బెల్టు, హెల్మెంట్ ధరించకుండా, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై జరిమానాలు విధిస్తున్నారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని నంబర్ ప్లేట్ తెచ్చి వాహనానికి పెట్టిన తర్వాతనే జరిమానా విధించి వదిలేస్తున్నారు.

సీజ్ చేసిన వాహనాలు, జరిమానా వివరాలు ఇలా..

తేదీ	సీజ్	జరిమానా (రూ.లలో)
08	568	2,42,200
09	376	74,000
10	402	65,400

సమస్యలు ఎదురవ్వకుండా..

రోడ్డు ప్రమాద కేసులను చేధించే క్రమంలో పోలీసులకు సమస్యలు ఎదురవకుండా వాహనాలకు అన్నిరకాల పత్రాలు ఉండేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో జరిమానా వేస్తున్నారు. అధికంగా పొగ వచ్చే వాహనాలతోపాటు కాలం తీరిన వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. బుల్లెట్ వాహనదారులు అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా అమర్చిన సైలెన్సర్లను తొలగింపజేస్తున్నారు. వాహనదారుడు అంగీకరించకపోతే రూ.5 వేల జరిమానా విధించి, ఎంవీఐ అధికారులకు అప్పగిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా వెళ్తూ పట్టుబడిన వాహనాలకు స్పాట్‌లోనే ఆన్‌లైన్‌లో జరిమానాలు విధిస్తున్నారు.

కఠినంగా అమలు చేయాలి



ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయడం ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగవు. ప్రతి వాహనదారుడి వెంట అన్ని ఆధారాలు ఉంటే.. పోలీసులు తనిఖీ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. వాహనానికి ఇన్సూరెన్స్ ఉండడం ద్వారా బాధితులకు కొంత ఆర్థిక భరోసా ఉంటుంది.

నాంపల్లి భాగ్య, అడ్వకేట్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాధాలు జరగకుండా క్షేమంగా గమ్యం చేరతాడు. రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేస్తున్న కృషికి వాహనదారులు సహకరించాలి. వాహనాన్ని తనిఖీలు చేసినప్పుడు పోలీసుకు అన్ని ఆధారాలు చూపించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తాం. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. నెంబర్ ప్లేట్, సీట్‌బెల్టు లేకుండా, ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం, భారీ శబ్దం వచ్చేలా బులెట్ సైలెన్సర్ మార్చితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్పీ అపూర్వరావు

కౌన్సిలింగ్ ఇస్తున్నాం

ఆటోలను రోడ్లపై ఎక్కడబడితే అకస్మాత్తుగా నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టుబడిన వాహనదారులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు జరిమానా విధించాం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తాం.

– శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ, నల్లగొండ

క్లుప్తంగా

డీవీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మృతి


ఎలమంద

నల్లగొండ రూరల్ : డీవీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్డ ఎలమంద(90) అనారోగ్యం కారణంగా శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని చర్లపల్లిలోని డీవీఎం బీఈడీ కళాశాలలో ఉంచి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కుమారుడు దొడ్డ నాగరాజు, శాంతికుమార్ పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో నాగరాజు, శ్రీధర్, శ్రీదేవి, నారాయణరెడ్డి, బొడ్డుపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా.. దొడ్డ ఎలమంద 1979లో డీవీఎం ఎడ్యుకేషనల్ సొసైటీని, రామగిరిలో పాఠశాలను, 1980లో బీఈడీ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను దగ్గర చేశారు.


బ్రిక్స్ కంపెనీపై కేసు

నకిరేకల్ : ఇటుక బట్టీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పని చేయిస్తుండడంతో బ్రిక్స్ కంపెనీపై నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ బైపాస్‌లోని సాయిప్రియ హోటల్ సమీపంలో ఉన్న వీజేఎం బ్రిక్స్ కంపెనీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి రోజు వారి కూలి డబ్బులు ఇవ్వకుండా రోజు 16 గంటల నుంచి 18 గంటలు పనులు చేయించుకుంటున్నారు. సమాచారం మేరకు నకిరేకల్ తహసీల్దార్ ప్రసాద్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ రంగారెడ్డి శుక్రవారం సదరు వీజేఎం బ్రిక్స్ కంపెనీ వద్ద విచారణ చేశారు. విచారణలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10 కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నట్లు తేలడంతో సదరు కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. సదరు కార్మికులకు వేతనాలు ఇప్పించి వారి రాష్ట్రానికి పంపించినట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

పుష్కరఘాట్.. డేంజర్ స్పాట్

సాగర్ శివాలయ పుష్కరఘాట్ వద్ద కానరాని రక్షణ చర్యలు

- స్నానానికి నదిలోకి దిగి వరద ఉధృతికి కొట్టుకుపోతున్న పర్యాటకులు
- గడిచిన నాలుగేళ్లలో 37మంది మృతి



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ వద్ద కృష్ణానదిలో వరద ఉధృతికి తట్టుకోలేక నీటమునిగి పర్యాటకులు మృత్యువాత పడుతున్న సంఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. నదీ తీర ప్రాంతాల్లో ఎక్కడా ప్రమాద హెచ్చరికల బోర్డుల ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో సందర్శకులు ప్రమాదాలకు గురవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 2022 ఆగస్టు 12న సాగర్‌కు విహారయాత్రకు వచ్చి తిరుగుప్రయాణంలో అక్కంపల్లి జలాశయంలో ఈత కొట్టడానికి దిగి ముగ్గురు నీటమునిగి మరణించారు. ఈ సంఘటన మరవకముందే గురువారం నాగార్జునసాగర్‌లోని శివాలయం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతికి కొట్టుకపోయి ముగ్గురు మృతిచెందారు. నదీతీర ప్రాంతంలో ఫెన్సింగ్ ఉండి, హెచ్చరిక బోర్డులు ఉంటే వారు నీటిలోకి దిగే సాహసం చేసి ఉండే వారు కాదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రాజెక్టు, రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, పర్యాటక అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పుష్కరఘాట్ వద్ద జరిగిన ప్రమాదాల్లో మృతుల సంఖ్య

సంవత్సరం	మరణాలు
2019	10
2020	8
2021	8
2022	7
2023	4 (ఫిబ్రవరి 10 వరకు)

గడిచిన నాలుగేళ్లలో..

2019 నుంచి 2023 ఫిబ్రవరి 10వ తేదీ వరకు సాగర్ జలాశయం, కృష్ణానదిలో పడిన ఘటనలో 37మంది మృతిచెందారు. సాగర్ వద్ద నీటిలో పడి దిగువ ప్రాంతాలకు కొట్టుకుపోయినవారే కాకుండా కేవలం నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలే చాలా ఉన్నాయి. దయ్యాలగండి ప్రాంతం పెద్దవూర పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలకో సంఘటన జరుగుతూనే ఉంటుంది.

సుమారు 10కిలోమీటర్ల నదీతీరం..

జలాశయతీరం, నదీతీరం సుమారుగా 10కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రాజెక్టు ఎగువన దయ్యాల గండి పుష్కరఘాట్, డౌన్ పార్కు పుష్కరఘాట్ (లాంచీస్టేషన్)లు ఉన్నాయి. డ్యాం దిగువన శివాలయం ఘాట్‌తోపాటు చింతలపాలెం రోడ్డులోని సురికి ఆంజనేయ పుష్కరఘాట్‌లు ఉన్నాయి. గతంలో సాగర్‌డ్యాం దిగువన నీరు పారుతూ ఉండేది. టెయిల్‌పాండ్ డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత ఎప్పుడు సాగర్‌డ్యాంను ఆనుకొని నీరు నిలబడి ఉంటుంది. కృష్ణానదికి వరదలు వచ్చి సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తిన సమయంలో ఆ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. జలాశయతీరంతో పాటు కృష్ణాతీరంలోని నీటిలోకి దిగుతారు. అంతేకాకుండా మత్స్యకారుల పుట్టీల్లో ఎక్కి జలాశయంలో తిరుగుతుంటారు. వరద ఉధృతికి పుట్టీ బోర్లా పడితే ప్రాణాలు గాలిలో కలిసే అవకాశం ఉంది.


పుట్టీల్లో విహరిస్తున్న పర్యాటకులు (ఫైల్)

అతి ప్రమాదకరమైన ప్రాంతం

సాగర్‌డ్యాం దిగువన గల శివాలయం పుష్కరఘాట్ అతిప్రమాదకరమైనది. ఇక్కడ స్నానాలకు దిగి చాలామంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఎగువన విద్యుదుత్పాదన కేంద్రం ఉండటంతో 8యూనిట్ల ద్వారా విద్యుదుత్పాదనతో నీటిని విడుదల చేస్తారు. సైరన్ మోగించిన తర్వాతే నీటిని విడుదల చేసినప్పటికీ ఆ సైరన్ ఒక్కోసారి నీటి సవ్వడికి పర్యాటకులకు వినపడకపోవచ్చు. నిముషాల్లోనే వరద నీటి ఉధృతి పెరగడం, సందర్శకులు తేరుకోక ముందే వరద సుడులు తిరుగుతూ రావడంతో నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉంది.

ముగిసిన అంత్యక్రియలు

కృష్ణానదిలో నీటమునిగి మృతిచెందిన ముగ్గురి అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. గురువారం రాత్రి మృతదేహాలు లభ్యం కాగా స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున రెండు గంటలకు పోస్టుమార్టం నిర్వహించారు. కేశవపంతుల వెంకటేశ్వర శర్మ కుమారుడు వాచస్పతి మృతదేహం, శర్మ బావమరిది హరికీర్తి నాగరాజు మృతదేహాలను హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు తరలించారు. ఉప్పలచంద్రకాంత్ మృతదేహాన్ని పైలాన్‌కాలనీలోని వారి ఇంటికి తరలించారు. శుక్రవారం వాచస్పతి, నాగరాజుల అంత్యక్రియలు బోడుప్పల్‌లో జరిగాయి. చంద్రకాంత్ అంత్యక్రియలు పైలాన్‌కాలనీలోని శ్మశానవాటికలో నిర్వహించారు. నాగరాజు కుమారుడు హరికీర్తి హర్షిత్ ఉపనయనం శుక్రవారం జరగాల్సి ఉండగా తండ్రి మరణంతో నిలిచిపోయింది.

సామూహిక ఉపనయన మహోత్సవం


ఉపనయనం అందజేస్తున్న ఎమ్మెల్సీ సురభిదేవి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సత్ర భవన్‌లో బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే శుక్రవారం సామూహిక ఉపనయన మహోత్సవం నిర్వహించారు. తుని శ్రీసచ్చిదానంద తపోవన శ్రీమఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామిజీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గతంలో బ్రాహ్మణ కుటుంబాల్లో 9ఏళ్లకే ఉపనయనాలు చేసే వారని, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఆలస్యంగా ఉపనయనాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవి ప్రసాదరావు మాట్లాడుతూ బ్రాహ్మణులు ఆర్థిక స్థోమత లేని కారణంగా ఉపనయనం చేసుకోలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, అర్చకులు తదితరులున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నల్లగొండ రూరల్ : కార్మికుల వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని దీపకుంటలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాద చర్యలతో కార్మికవర్గంలో చీలికలు తెచ్చి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4కోడ్‌లుగా విభజించి బడా పారిశ్రామిక వేత్తలకు కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతన జీఓను సవరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 17 వరకు పారిశ్రామిక రంగంలో ఉన్న అన్ని కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించి 18, 19వ తేదీల్లో సమీక్ష నిర్వహించి ప్రణాళికలు నిర్వహిస్తామన్నారు. మార్చి 1న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దబ్బికార్ మల్లేష్, ప్రమీల, సలీం, సైదులు, నారబోయిన శ్రీనివాస్, దండెంపల్లి సత్తయ్యగౌడ్, యాదయ్య, లింగస్వామి, గౌతమ్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజలి సేవ


అండాళ్ అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి తిరువీధి, ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధిలో సేవను ఊరేగించారు. ఇక ప్రధానాలయం, ముఖమండపం, ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణం చేపట్టారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల పట్టివేత


పోలీసులకు పట్టుబడిన వాహనం

చౌటుప్పల్ : ఎలాంటి అనుమతులు లేకుండా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన అత్తాపూర్, షాద్‌నగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల నుంచి సేకరించిన చికెన్ వర్థాలను 4వాహనాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లాలోని పెద్దపాడు మండల కేంద్రానికి తరలిస్తున్నారు. వీటిని ఆ ప్రాంతంలోని చెరువుల్లో చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న నాలుగు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వాహనాల డ్రైవర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కారు బోల్తా... ఒకరు మృతి

- 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన


ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

మోత్కూరు : వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామం 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన దొండ లింగయ్య ఆయన భార్య నీలమ్మ, చిన్న కూతురు, అల్లుడు నాగం అరుణ, నాగం ప్రకాష్, వీరి కూతుళ్లు ప్రీతి, శ్రవణ్‌లతో పాటు లింగయ్య పెద్ద కూతురు పిల్లలు ఇందుశ్రీ, స్మిత, లింగయ్య వియ్యంకుడు నాగం బలరాంలతో కలిసి కారులో రామన్నపేటలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బుజిలాపురం సబ్‌స్టేషన్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న వర్రెలో పడిపోగా డ్రైవింగ్ చేస్తున్న అతడి చిన్న అల్లుడు నాగం ప్రకాష్ (35) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీలమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఈమె పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నలుగురు చిన్నారులకు స్థానిక శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి క్లినిక్‌లో చికిత్స అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వి.జానకిరాం రెడ్డి సిబ్బందితో వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన చిన్నారులను పోలీస్ వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీపీ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ

బీబీనగర్ : బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను ఎస్‌ఐను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం శ్రీ లింగబసవేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన త్వరలో జరగబోయే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ తదితర స్థలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి, భువనగిరి రూరల్ సీఐ వెంకటయ్య, బీబీనగర్ ఎస్సై సైదులు, సిబ్బంది ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆలేరురూరల్ : రైలు ఢీకొన్న ఘటనలో శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎండీ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం .. జనగాం పట్టణానికి చెందిన ఎండీ అబ్దుల్‌కదీర్ (60) ఉదయం 8:30 గంటల సమయంలో ఆలేరుకు వచ్చాడు. కిమీ 265బై34 వద్ద డౌన్‌లైన్ పట్టాల సమీపం నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనుకగా వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో అతడి తల వెనుక భాగం పూర్తిగా చిట్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

ఆలేరురూరల్ : గాయాలతో పడి ఉన్న వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆలేరులోని రెడ్డిగూడెం శివారులో రైల్వే వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో పడి ఉండడంతో రైల్వే పోలీసులు గుర్తించి ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. రైలులో భిక్షాటన చేస్తూ రైలు నుంచి జారిపడి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నామని రైల్వేపోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..

మేళ్లచెరువు : ప్రమావశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చవ్వ వీరయ్య(60) స్థానికంగా జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి వచ్చి సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఉన్న బావి అరుగుపై కూర్చున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయి మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానికుల సాయంతో వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి

హుజూర్‌నగర్: విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నామని విద్యుత్ వినియోగదారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ దిలీప్‌కుమార్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని విద్యుత్ డీఈ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థను ప్రభుత్వం నాలుగు విభాగాలు చేసి ప్రతి విభాగానికి జ్యూడిషియల్ అధికారాలు నియమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో 650 ఫిర్యాదులు స్వీకరించి వాటిలో 500 పరిష్కరించినట్టు తెలిపారు. స్థానికంగా చేసిన పరిష్కారం నచ్చకపోతే తిరిగి అంబుడ్స్‌మన్ సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సదస్సులో పలువురు నుంచి ఫిర్యాదులు స్వీకరించి కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ బోర్డు టెక్నికల్ అధికారి నాగేశ్వరరావు, ఎస్ఈ పాల్ రాజ్, డీఈలు వెంకట కష్ణయ్య, శ్రీనివాస్, ఏడీఈ సక్రు నాయక్, అధికారులు రాంప్రసాద్ పాల్గొన్నారు.


విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

ఎయిమ్స్ వైద్య విద్యార్థుల క్షేత్ర పర్యటన


బొమ్మలరామారంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఎయిమ్స్ వైద్య విద్యార్థులు

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను బీబీనగర్ ఎయిమ్స్ వైద్య విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్య, ఫిజికల్ యాక్టివిటీస్, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోని మెనూ, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత విధానాలు, ప్రథమ చికిత్స, నీటి, అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రిక్ షాక్, ప్రాణ హాణి, అంటు వ్యాధుల నివారణ గురించి పాఠశాల విద్యార్థులకు బోధించే విధానాలను స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ స్టాలిన్ బాబు వివరించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఉపేంద్ర, డాక్టర్ శివరాం, రవి నాయక్, పర్యవేక్షకులు క్రిష్ణామూర్తి, భాస్కర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో దొంగల బీభత్సం

భువనగిరి : పట్టణ శివారులోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న పలు దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కలెక్టరేట్ ఎదురుగా ఉన్న 3టీ, భోజనం షాపులకు సంబంధించి రేకులపై కప్పులు తొలగించి అందులోకి ప్రవేశించారు. అందులో ఉన్న సుమారు రూ.85 వేల నగదుతో పాటు పలు రకాల వస్తువులను అపరించుకువెళ్లినట్లు బాధితులు తెలిపారు.

రహదారి దిగ్బంధనంలో పెద్దఎత్తున పాల్గొనాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

చౌటుప్పల్ : ఈనెల 13న నిర్వహించనున్న హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి దిగ్బంధానికి పార్టీలకతీతంగా పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ శ్రేణులతో అత్యవసర భేటీ నిర్వహించారు. దిగ్బంధనం విజయానికి గ్రామాల వారీగా కమిటీలను ప్రకటించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఊరు నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల చంద్రస్వామి, బోయ లింగస్వామి, దేవేందర్, ఊదరి శ్యామ్, నర్సింహ, మహేష్, సుక్క అర్జున్, స్వామి, యాదయ్య, వెంకటేష్, లింగస్వామి, తదితరులు ఉన్నారు.

పప్పు దినుసుల సాగుతో పోషకాహార భద్రత

- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్


మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

గరిడేపల్లి : పప్పు దినుసులను ప్రోత్సహించడం ద్వారా పోషకాహార భద్రత సాధించవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలో పప్పు ధాన్యాల సాగు విస్తరణకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పప్పు దినుసుల్లో 25శాతం వరకు మాంస కృత్తులు ఉంటాయని, వీటితో పాటు పొటాషియం, పాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం, జింక్, ఫోలేట్, థయామిన్, నియాసిన్‌లు ఉంటాయని పేర్కొన్నారు. తినే ఆహారంలో పప్పు దినుసులు చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ పెరగకుండా ఉండడంతోపాటు, గుండె జబ్బులు రాకుండా ఉంటాయని తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద కేవీకే ద్వారా క్లస్టర్ స్థాయిలో పప్పు దినుసులైన కంది, పెసర, మినుము పంటలపై ఎంపిక చేసిన రైతుల క్షేత్ర స్థాయిలో సామూహిక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకు కావాల్సిన విత్తనాలు, కీలక ఉత్పత్తులను రైతులకు అందజేసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో లయోలా కళాశాల వ్యవసాయ విద్యార్థినులు మహేశ్వరి, సౌమ్య, ప్రవళిక, శరణ్య, శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, నరేష్, మాధురి, రైతులు పాల్గొన్నారు.